జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 2 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6


## 24×7 కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు తక్షణ సేవలు

- వర్షాల అత్యవసర పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 01 (ప్రజాజ్యోతి)** వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా కేంద్రంలోని ఐటి ఓ సి కార్యాలయంలో జీ–19 గదిలో 24×7 జిల్లా కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆగస్టు 3, సోమవారం నుంచి వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులను మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు, ఉదయం 7.00 గంటల నుంచి

మిగతా 2 లో...




# నాడు రాఘవ... నేడు రేగా..!

6 లో..

- జిల్లాలో వరుసగా తెరపైకి వస్తున్న వివాదాలు...
- బీఆర్ఎస్ కు ఇబ్బందికరంగ మారుతున్న పరిస్థితులు
- మూడు సంవత్సరాల క్రితం పాల్వంచ ఘటన రాష్ట్రాన్నే కుదిపేసింది..
- ఇప్పుడు జిల్లా అధ్యక్షుడిపైనే కేసు నమోదు కావడంతో మళ్లీ అదే చర్చ..
- ప్రజల మదిలో ఇంకా చెరగని పాత జ్ఞాపకాలు.. కొత్త వివాదంతో మళ్లీ తెరపైకి..
- పార్టీ ప్రతిష్ఠపై మరోసారి చర్చకు దారితీసిన పరిణామాలు..
- నాయకుల వ్యక్తిగత వ్యవహారాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు..

## రూ.52 కోట్ల పెట్టుబడి మోసానికి చెక్..!



- ఆర్థిక నేరాలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పక్కా దర్యాప్తు
- జూలై 9 కేసు నమోదు, 19 న సాంకేతిక ఆధారాలతో కేరళలో నింది తుడి అరెస్టు
- బాధితుల సొమ్ముతో కొను గోలు చేసినట్లు భావిస్తున్న ఆస్తుల గుర్తింపు
- 35 వాహనాలు, భవనం, ప్లాట్ స్వాధీనం దిశగా కీలక చర్యలు
- పూర్తి మనీ ట్రైల్ పై దృష్టి.. మరిన్ని బాధితుల గుర్తింపునకు దర్యాప్తు
- పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

2 లో...




- స్నేహబంధానికి అధిక ప్రాధాన్యత..
- కష్ట సుఖాల్లో కలకలం నిలిచేది స్నేహమే
- నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం

**ఇల్లందు, ఆగస్ట్ 1 (ప్రజా జ్యోతి)** స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా..కడ దాక నీడలాగ నిను వీడి పోదురా.. దోస్త్ మేరా దోస్త్ తూహీ మేరా జాన్.. వాస్తవం రా దోస్త్..నువ్వే నా ప్రాణం" అంటూ సినీ కవులు కవిత్వం రాసినా.. స్నేహానికి ఉన్న గొప్పదనం ఎన్ని రకాలుగా చెప్పినా వర్ణించేందుకు వీలుకానిదే...! అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహం. స్నేహం అనేది ఆ దేవుడిచ్చిన గొప్ప వరం. అమ్మ, నాన్న, అక్క, తమ్ముడు, చెల్లె, అన్న మొదలైన బంధాలను ఆ దేవుడే సృష్టించి ఇచ్చిన స్నేహితులను మాత్రం మనమే ఎంచుకోమన్నాడు. అందుకే మంచి స్నేహాన్ని సంపాదించుకొని భద్రంగా కాపాడుకుంటే అది మన జీవితాన్ని సంతోషంగా ఉంచుతుంది. మనిషి జీవితంలో కుటుంబం తరువాత అత్యంత విలువైన బంధం స్నేహబంధం. రక్తసంబంధం కాకపోయినా హృదయాలను కలిపే పవిత్రమైన అనుబంధమే స్నేహం. సుఖంలో పలువురు తోడుంటారు... కానీ కష్టకాలంలో చేయూతనిచ్చి ధైర్యం చెప్పేది నిజమైన స్నేహితుడే. అలాంటి స్నేహబంధం గొప్పతనాన్ని గుర్తుచేస్తూ ఆగస్టు నెల మొదటి ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు.

◆ **స్నేహితుడి కోపాన్ని.. లోపాన్ని భరించడమే నిజమైన స్నేహం..**

ఎదుటి వాడిలోని కోపాన్ని, లోపాన్ని భరించే వాడే నిజమైన స్నేహితుడు అంటారు. స్నేహం అనేది ఇలా ఉండాలి.. అలా ఉండాలి అంటూ దానికి ఒక నిర్దిష్టమైన లెక్కలు, అంచనాలు ఉండవు. మనకు గురువులా బోధించి, దారిచూపి, తప్పుచేసినప్పుడు మందలించే వ్యక్తి నిజమైన స్నేహితుడు. మంచి స్నేహితుల మధ్య ఎటువంటి మోహమాటాలు, రహస్యాలు ఉండవు. అవసరమైనప్పుడు నిస్సంకోచంగా

మిగతా 2 లో...

# 24×7 కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు తక్షణ సేవలు

(మొదటి పేజీ తరువాయి...)

మధ్యాహ్నం 2.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు, రాత్రి 9.00 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7.00 గంటల వరకు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పని చేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి కంట్రోల్ రూమ్ కు అందే ఫిర్యాదులు, సమాచారం, వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను వెంటనే నమోదు చేసి సంబంధిత శాఖలకు సమాచారం అందిస్తూ తక్షణ చర్యలు చేపట్టేలా సమన్వయం చేయాలని విధుల్లో ఉన్న సిబ్బందిని ఆదేశించారు. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసి, దానిపై తీసుకున్న చర్యల వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు.జిల్లాలో వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం వంటి పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత శాఖలు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ శాఖలకు కేటాయించిన అధికారులు, ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా సెలవులో ఉన్నట్లయితే వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల దృష్ట్యా కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు.వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ 08744-241950 నంబర్ కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ప్రజల నుంచి అందే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# స్నేహం ఓ మధురం ...! స్నేహం ఓ వరం ...!!

(మొదటి పేజీ తరువాయి...)

తమ కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకుంటారు. కష్ట సమయంలో కలత చెందిన మనసుకి వెన్నలా చల్లదనాన్ని, ప్రశాంతతను కలిగించే దివ్య ఔషధం స్నేహం. తమకు అవసర మైనప్పుడు కనీసం మాట సాయం చేయడానికైనా ఆప్తమిత్రులు ఉన్నారనే భావం మన కష్టాల తీవ్రతను తగ్గిస్తుంది. వారితో చర్చించి సమస్యకు పరిష్కారం కనుక్కొనాలనే ఆలోచనను కూడా కలిగిస్తుంది.



### ♦ కంటికి దూరమైనా మనసుకు దగ్గరగా ఉండేదే స్నేహం

ప్రతీ రోజు మాట్లాడుకోకున్నా అవసర మైనప్పుడు మనకు ధైర్యం, ఓదార్పు చెప్పే నేస్తం ఉన్నాడనే నమ్మకం మనకు కొండంత ధైర్యాన్ని, మనసుకు ఉపశమనాన్ని ఇస్తుంది. అందుకే నిజమైన స్నేహితుడు కంటికి దూరమైనా మనసుకు దగ్గరగా ఉంటాడని అంటారు. ఒక్కోసారి కుటుంబ సభ్యులతో కూడా చెప్పుకోలేని సమస్యలను ఆత్మీయ స్నేహితులతో నిర్మొహమాటంగా చర్చించుకోవడం స్నేహితుల మధ్య జరిగే అతి సాధారణ ప్రక్రియ. ఇక ఈ స్నేహితుల రోజు వెనుక ఉన్న కథ ఏంటో ఒకసారి తెలుసుకుందాం..! 1935వ సంవత్సరం ఆగస్ట్ మొదటి శనివారం రోజున అమెరికా ప్రభుత్వం చేతిలో హతమైన తన స్నేహితుడిని మర్చిపోలేని మరో స్నేహితుడు ఆ తరువాత రోజైన ఆదివారంనాడు ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. దీనికి చలించిపోయిన అమెరికా ప్రభుత్వం ఆగస్ట్ మొదటి ఆదివారాన్ని 'ఇంటర్నేషనల్ ఫ్రెండ్ షిప్ డే'గా ప్రకటించింది.

### ♦ సృష్టిలో అమ్మ తర్వాత కమ్మనైన పదం స్నేహం..!

ఇక అప్పటినుంచి ఈ ఫ్రెండ్షిప్ డే అలా అలా వ్యాపిస్తూ విశ్వవ్యాప్తమయ్యింది. స్నేహం అనేది ఇద్దరు పరిచయస్తుల మధ్య మాత్రమే ఉండే బంధం దాల్చక ముందే పరిష్కారమవుతాయి. స్నేహంగా ఉన్నప్పుడు అనుమానం, కోపం, ద్వేషం కూడా దరిదాపులకు రావడానికి జంకుతాయి. కాని ఒక్కోసారి స్నేహం కూడా దుర్వినియోగం అయ్యే అవకాశాలు చాలా ఉంటాయి. అందరినీ స్నేహితులని నమ్మి మోసపోవడం కంటే ముందే జాగ్రత్త పడడం మంచిది.

### ♦ స్నేహం జీవితానికి బలం

స్నేహం అనేది కేవలం కలిసి తిరగడం, మాట్లాడుకోవడం మాత్రమే కాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, కష్టాల్లో ధైర్యం చెప్పడం, విజయాల్లో అభినందించడం, అపజయాల్లో అండగా నిలవడం నిజమైన స్నేహానికి నిదర్శనం. మంచి స్నేహితుడు జీవితానికి మార్గదర్శిగా నిలుస్తాడని పెద్దలు చెబుతుంటారు.

### ♦ కాలం మారినా స్నేహానికి చెదరని విలువ

నేటి ఆధునిక యుగంలో సోషల్ మీడియా ద్వారా వేలాది మంది పరిచయస్తులు ఉన్నా, నిజమైన స్నేహితులు మాత్రం కొద్దిమందే ఉంటారు. దూరాలు పెరిగినా, కాలం మారినా, పరిస్థితులు ఎలా ఉన్నా నిలిచిపోయే బంధమే నిజమైన స్నేహం. యువతలో ఉత్సాహంగా వేడుకలు స్నేహితుల దినోత్సవం సందర్భంగా యువత ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఫ్రెండ్ షిప్ బ్యాండ్లు కట్టుకోవడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, కలిసి సమయం గడపడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక సందేశాలు, ఫొటోలు పంచుకుంటూ తమ స్నేహాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

### ♦ స్నేహాన్ని అడ్డం పెట్టుకుని మోసం చేసే నకిలిగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

ప్రతీదానికి మంచి చెడు ఉన్నట్టే స్నేహం విషయంలోనూ ముందు జాగ్రత్త, నమ్మకం చాలా ముఖ్యం. యువతీ, యువకులే కాక అరమరికలు లేని స్నేహానికి గుర్తుగా ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం ఎంతో ఉత్సాహంగా ఈ రోజును జరుపుకుంటారు. ఈ రోజుల్లో 'అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం' యువత మధ్య పెద్ద క్రేజ్ మారింది. తమ స్నేహితులను కలవడానికి ఎంతో ఉత్సాహం చూపిస్తారు. స్నేహితుల ఇళ్లకు వెళ్లి ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కడుతుంటారు. ఇలాగే స్నేహంలోని సరిగమలను ఆస్వాదిస్తూ.. చిన్నా, పెద్దా బేధం లేకుండా... ఈ స్నేహ మధురిమలను కలకాలం నిలుపుకోవాలని మనసారా కోరుకుందాం. ప్రతి ఒక్క స్నేహితులు ఎంతో ఆనందగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆశిద్దాం..

# రూ.52 కోట్ల పెట్టుబడి మోసానికి చెక్..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రజాజ్యోతి:** పెట్టుబడుల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి కోట్ల రూపాయలు కాజేసిన కేసును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఛేదించారు. సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ, క్షుణ్ణమైన దర్యాప్తుతో ప్రధాన నిందితుడిని కేరళలో అరెస్టు చేయడమే కాకుండా, నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడం ఈ కేసులో కీలక పరిణామంగా నిలిచింది. బాధితుల సొమ్మును గుర్తించి తిరిగి రికవరీ చేసే దిశగా పోలీసులు వేగంగా ముందుకు సాగడం బాధితుల్లో ఆశలు రేకెత్తిస్తోంది.






### ♦ దర్యాప్తు సాగింది ఇలా..

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ లో జూలై 9 న నమోదైన క్రైమ్ నంబర్ 134/2026 కేసును కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ఫిర్యాదుదారు భార్పాటి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్ ను జూలై 19 న ఆరెస్ట్ చేశారు. ఆపై రేమాండ్ కు తరలించి తిరిగి పోలిస్ కస్టడి కి అనుమతి పొందారు. అందులో భరత్ కుమార్ అను నిందితుడు భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్ లో లేబర్ కాంట్రాక్టర్ గా పనిచేస్తున్నానని నమ్మించి, కాంట్రాక్ట్ పనుల్లో భాగస్వామ్యం కల్పిస్తానని చెప్పి పలువురి నుంచి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల నమ్మకాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించడంతో పాటు లాభాల్లో నాలుగు శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఈ మోసానికి పాల్పడినట్లు విచారణలో బయటపడింది.

### ♦ రికవరీ చేసినవి ఇవి..

కేసు దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను వినియోగించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో జూలై 19 న అరెస్టు చేశారు. ట్రాన్సిట్ వారెంట్ పై జిల్లాకు తీసుకొచ్చి పోలీసు కస్టడీలో విచారించారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా బాధితుల నుంచి సేకరించిన డబ్బుతో భద్రాచలం రాజీవ్ నగర్ కాలనీలో మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ నేరార్జిత ఆస్తులను చట్టపరంగా స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసులో ఇంకా ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, పత్రాల పరిశీలన కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. మరిన్ని బాధితులను గుర్తించడం, మొత్తం మనీ ట్రైల్ ను వెలికితీయడం, ఇతర నేరార్జిత ఆస్తులను గుర్తించడం దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

### పోలీసుల సూచనలు ఇవే..

ఈ సందర్భంగా జిల్లా పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని, పెట్టిన పెట్టుబడికి రెట్టింపు రాబడి వస్తుందని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంస్థల విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని, అనుమానాస్పద ఆర్థిక పథకాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్న లక్ష్మీదేవిపల్లి పోలీసులు, జిల్లా టాస్క్ ఫోర్స్ బృందాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. ఆర్థిక నేరాల నియంత్రణలో సాంకేతిక దర్యాప్తు, వేగవంతమైన చర్యలు ఎంత కీలకమో ఈ కేసు మరోసారి నిరూపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పాత కూరగాయల మార్కెట్ అక్రమ కూల్చివేయడం సరికాదు






**ఇల్లందు, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)** ఇల్లందు పాత కూరగాయల మార్కెట్‌ను శనివారం తెల్లవారు ఝామున నుంచి మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బందితో కూల్చివేయటం సరికాదని అఖిలపక్ష నాయకులు మార్పలంతో బుల్డోజర్ అబ్దుల్ నబీ, దిండిగల రాజేందర్, తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, మావునూరి మాధవ్, బాలగాని గోపి కృష్ణలు అన్నారు. పాత కూరగాయల మార్కెట్ కూల్చివేస్తున్న విషయం తెలుసుకున్న అఖిలపక్ష నాయకులు అక్కడికి చేరుకొని కూల్చివేతను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా పాత కూరగాయల మార్కెట్లో వ్యాపారాలకు కొనసాగించిన వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. పాత కూరగాయల మార్కెట్లో కొన్ని ఇంక్రో చ్మెంట్ దుకాణాలు ఉన్నాయని, మున్సిపల్ టిపిఓ వచ్చి వాటిని గుర్తించాలని కోరారు. వ్యాపారులను ఇబ్బందులకూ గురిచేవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, వ్యాపారులు గౌస్, జాని, ఖాజా, రాజేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయండి



**గుండాల ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)** ఈనెల 9న గుండాలలో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం జయప్రదం చేయాలని, అఖిలపక్ష పార్టీలు, ఆదివాసి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం గుండాలలో ఆ సంఘ నేతలు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొరలు మాట్లాడారు. 1982 ఆగస్టు 9న జెనీవాలో యుఎన్ ఆదివాసుల కోసం జరిగిన తొలి కార్యవర్గ సమావేశానికి గుర్తుగా 1994 నుంచి ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసుల దినోత్సవం జరుపుకుంటూ నారని అందులో భాగంగానే ఆగస్టు 9న జరిగే ఆదివాసి దినోత్సవం జయప్రదం చేయాలని కోరారు ఈ సమావేశంలో మాస్ లైన్ మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు పరిశిక రవి, గడ్డం లాలయ్య, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు గోవింద నరసింహారావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, ఏ ఎస్ పి మండల నాయకులు పూనం రమణబాబు, కల్తీ లక్ష్మణ్, బిజెపి నాయకులు సోలం సతీష్, ఈసం కృష్ణ, ఈసం పాపారావు, తెల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి కాలనీ సమస్యలు పరిష్కరించండి



**చర్ల, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలోని లక్ష్మీ కాలనీ గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దోసిల్లపల్లి గ్రామానికి చెందిన బీరబోయిన రాణి డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని గత మూడు నెలలుగా చెత్త సేకరణ వాహనం ప్రధాన రహదారుల పక్కనే ఉన్న ఇళ్ల వరకు మాత్రమే వెళుతున్నారని గ్రామంలోని అన్ని వీధులు, ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్త సేకరించడం లేదని ఆమె ఆరోపించారు. పంచాయతీ సిబ్బంది ప్రతి వీధిలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అదే విధంగా గ్రామంలోని వాటర్ ట్యాంకులు పరిశుభ్రంగా లేకపోవడంతో తాగు నీటి నాణ్యతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని కోరారు. గ్రామంలోని వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో ఈగలు, దోమలు అధికమై చిన్నారులు, వృద్ధులు విష జ్వరాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి వీధి, ప్రతి ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే లక్ష్మీ కాలనీ గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీరబోయిన రాణి హెచ్చరించారు.

## వైభవంగా శ్రీ బాలాజీ స్వామి కల్యాణం

- సూరం కోటి రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన సేవ



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో ఆలయ విశేష సేవలు కొనసాగాయి. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ సేవను అశ్వారావుపేటకు చెందిన లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, తిరుపతమ్మ దంపతులు నిర్వహించారు. సూరం కోటి రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ రెడ్డి, నాగమణి దంపతులతో పాటు లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, తిరుపతమ్మ దంపతులు అన్నదాన సేవ ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ



**చర్ల, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి):** చర్ల మండలం సింగసముద్రం గ్రామంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని జి.ఎస్.ఎస్ చైల్డ్ కేర్ కేంద్రంలో చదువుతున్న 115 మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి గ్రేస్ సర్వీస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం వల్ల వారిలో చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని అన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీని వారు అభినందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ పూజారి లక్ష్మీనారాయణ, కేంద్ర సిబ్బంది, గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే అమలు చేయాలి: ఐఎఫ్ టీయూ

**టేకులపల్లి, ఆగస్టు 01, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం తక్షణమే అమలు చేయాలని ఐఎఫ్ టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు బానోత్ లక్ష్మణ్, ఎండి షఫీ డిమాండ్ చేశారు. టేకులపల్లిలో నిర్వహించిన ఆటో యూనియన్ స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రావడంతో ఆటో కార్మికుల ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. రోజువారీ ఆదాయం తగ్గిపోవడంతో ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక, కుటుంబ పోషణ భారాన్ని మోయలేక అనేక మంది ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక మంది యువకులు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే అందించి ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్ ను వెంటనే అమలు చేయకపోతే ఐఎఫ్ టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సంతోష్, గణేష్, తరుణ్, బాబు రావు, పూల్ సింగ్, ప్రసాద్, సురేష్, నవీన్, శ్రీను, భద్రూ తదితరులు పాల్గొన్నారు.




## కిన్నెరసాని వంతెన వద్ద ఘోర ప్రమాదం

- యువకుడికి తీవ్ర గాయాలు



**ఆళ్ళపల్లి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి –రాయిపాడు రహదారిలోని కిన్నెరసాని వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో టేకులపల్లి మండలం కోయగూడెంకు చెందిన ఎ. కార్తీక్ తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. స్థానికులు సమాచారం అందించడంతో 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అనంతరం ఆళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## రేగా కాంతారావుపై కేసులు రాజకీయ కుట్రే: బీఆర్ఎస్

- ప్రజాదరణను ఓర్వలేక తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపణ



**టేకులపల్లి, ఆగస్టు 01, ప్రజాజ్యోతి:** బీఆర్ఎస్ నాయకుడు రేగా కాంతారావుపై నమోదు చేసిన కేసులు పూర్తిగా రాజకీయ కుట్రలో భాగమేనని టేకులపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బొమ్మర్ల వరప్రసాద్ ఆరోపించారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాదరణను తట్టుకోలేక ప్రత్యర్థులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. రేగా కాంతారావు ఎలాంటి తప్పు చేయలేదని, న్యాయస్థానంలో నిజం వెలుగులోకి వచ్చి నిర్దోషిగా బయటపడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని, చివరికి న్యాయమే గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## భద్రతకు పెద్దపీట.. ఉత్పత్తిలో రాజీ వద్దు

- కోయగూడెం గనిలో డైరెక్టర్ ఆదేశాలు
- వర్షాల సవాళ్లను అధిగమించి బొగ్గు ఉత్పత్తి కొనసాగించాలి: కే. వెంకటేశ్వర్లు





**టేకులపల్లి,ఆగస్టు01, ప్రజాజ్యోతి:** సింగరేణి ఇల్లందు ఏరియా పరిధిలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్ గనిని సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ & ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు శనివారం సందర్శించి బొగ్గు ఉత్పత్తి, లోడింగ్, రవాణా పనుల ను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాకాల పరిస్థితుల్లో ఉత్పత్తి, రవాణా కొనసాగుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ఎదురయ్యే ఆటంకాలను ముందస్తు ప్రణాళికతో అధిగమిస్తూ బొగ్గు ఉత్పత్తి, రవాణా పనులు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించి, సంస్థ నిర్దేశించిన వార్షి క ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వర్షాల ప్రభావంతో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు.ఈ పర్యటనలో కోయగూడెం ఓపెన్‌కాస్ట్ మేనేజర్ కె. శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి, నరసింహారావు, అరుణ్ దినకర్, బండి రాము తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రేగా కాంతారావుపై కేసు రాజకీయ కుట్రే: బీఆర్ఎస్

- ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే తప్పడు కేసు పెట్టారని ఆరోపణ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావుపై నమోదైన కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని బీఆర్ఎస్ సుజాతనగర్ మండల అధ్యక్షుడు లావుడ్యా సత్యనారాయణ నాయక్ ఆరోపించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులను తప్పుడు కేసులతో భయపెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజల కోసం గొంతెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే రేగా కాంతారావుపై కేసు నమోదు చేశారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకే ఈ పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. ఒక మహిళను అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతున్న యువతి తాను ఫిర్యాదు చేయలేదని చెప్పిన అంశంపై కూడా పూర్తి వాస్తవాలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, వాస్తవాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అణచివేయాలని ప్రయత్నించినా ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని లావుడ్యా సత్యనారాయణ నాయక్ స్పష్టం చేశారు.

# పూసపల్లి ఓసిని త్వరితగతిన ప్రారంభించాలి

- సింగరేణి సంస్థను కాపాడాలి
- ఇల్లందు ఏరియాను కనుమరుగు కానివ్వం





**ఇల్లందు, ఆగస్ట్ 1 (ప్రజా జ్యోతి)** సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా కనుమరుగు కాకుండా త్వరితగతిన పూసపల్లి ఓసిని ప్రారంభించాలని ఐఎన్టియుసి ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఐఎన్టియుసి కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం జిఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థను కాపాడే బాధ్యత ఐఎన్టియుసి దేనన్నారు. ఇల్లందు ఏరియా పరిస్థితి దీనస్థితికి పోయేందుకు గతంలో పాలించిన పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నూతన గనులు తీసుకురావడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. గతంలో సింగరేణి పాలించిన వారే మరల సంస్థను మేమే కాపాడుతామని, గనులు తీసుకొస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. సింగరేణిని కాపాడుతూ, నూతన గరులు వారే తీసుకురావాలని, ప్రభుత్వంతో కలవాలని, పనిచేయాలని, మాటలు కాకుండా చేతుల్లో చూపించాలని సూచించారు. జూన్ 27న గోదావరిఖనిలో జరిగిన ఐఎన్టియుసి కోర్ కమిటీ సమావేశంలో సింగరేణి సంస్థలు ఎవరు కాపాడారని, ఐఎన్టియుసి గా మనమే కాపాడుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మణుగూరు డిప్ సైడ్ మైన్ ను కూడా సింగరేణి సంస్థకి కేటాయించాలని, ఆ మైండ్ విషయంలో అన్యాయం జరగవద్దని కోరారు. మణుగూరు డిప్ సైడ్ మైన్ సింగరేణికి కేటాయించని పక్షంలో మూడు సంవత్సరాలలో మణుగూరు కనుమరుగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందు ఏరియాలోని పూసపల్లి ఓసి ప్రారంభానికి అన్ని అనుమతులు వచ్చినప్పటికీ ఎందుకు కాలీ ఆపడం జరుగుతుందో అర్థం కావడం లేదని, కాలయాపన చేయకుండా పూసపల్లి ఓసి ప్రారంభించని పక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు, రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలతో పాటు ఇల్లందు ప్రజలను సైతం భాగస్వామ్యం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ముగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తాటిచర్ల మైన్ ను సింగరేణికి ఇచ్చామని చెప్పడం జరుగుతుందని, మరి కోయగూడెం ఓసి, ఆర్కే 5, ఆర్కే 6, భూపాలపల్లి, గోదావరిఖని, సత్తుపల్లి, మణుగూరు ఓసీలకు ఆక్షన్ నిర్వహించకుండా సింగరేణికే ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తాటిచర్ల మైన్ ను సింగరేణికి కేటాయించి, సంస్థను మేమే కాపాడుతామని, మేమే బ్రతికిస్తామని మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. సింగరేణి సంస్థలు అసంఘటిత రంగ కార్మికులు సుమారుగా 30 వేలకు పైగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్ వల్ల కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెరిగాయా అని ప్రశ్నించారు. సింగరేణి సంస్థ బ్రతకాలంటే ప్రస్తుతం నడుస్తున్న 16 మైన్స్ ను ఎలాంటి ఆక్షన్ కు పోకుండా సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇల్లందు సింగిల్ అనే అధికారులు పూసపల్లి ఓసిని ఎప్పుడు ప్రారంభిస్తారో అధికారికంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ నాయకులు గోచికొండ సత్యనారాయణ, భూక్య నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, నాయకులు ఈ యొక్క ధర్నా కార్యక్రమంలో బాబురావు, రాజన్న, బొల్లెద్దుల ప్రభాకర్, కొచ్చర్ల ప్రభాకర్, మాధవ్, రవి, లింగమూర్తి, విజయరాజ్, విజయ, గంగా, కిరణ్, దుర్గ, బాసు తదితరులు పాల్గొన్నారు.

## జీఎం వెల్ఫేర్ గా కే. అజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

- పదోన్నతిపై కీలక బాధ్యతలు చేపట్టిన అధికారి



**కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 1, ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో కార్పొరేట్ పర్సనల్ విభాగంలోని ఐఆర్ విభాగంలో ఏజీఎం (పర్సనల్)గా పనిచేస్తున్న కే. అజయ్ కుమార్ పదోన్నతిపై జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కొత్త బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం జి.వి. కిరణ్ కుమార్, జీఎం (పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సీ ఏ.జె.ఎస్.ఎం. మురళీధరరావు, డీజీఎంలు, సెక్యూరిటీ అధికారులు, పర్సనల్ విభాగం అధికారులు, ఉద్యోగులు, సీఎంఓఏఐ ప్రతినిధులు, గుర్తింపు సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐఆర్ అండ్ పీఎం జిఎంగా జి.వి. కిరణ్ కుమార్

- యాజమాన్య ఉత్తర్వులతో కొత్త బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్





**కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 1, ప్రజాజ్యోతి:** సింగరేణిలో ఇప్పటి వరకు జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.వి. కిరణ్ కుమార్ తాజాగా జనరల్ మేనేజర్ (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎంగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన కొత్త బాధ్యతలు చేపట్టారు. జీఎం (పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సీ ఏ.జె.ఎస్.ఎం. మురళీధరరావు, జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ కే. అజయ్ కుమార్, పర్సనల్ విభాగం అధికారులు, ఉద్యోగులు, గుర్తింపు సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా జి. రాజేంద్ర ప్రసాద్

- పదోన్నతిపై ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా నియామకం

**కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 1, ప్రజాజ్యోతి:** సంస్థలో కార్పొరేట్ పర్సనల్ విభాగంలోని పీఎం విభాగంలో ఏజీఎం (పర్సనల్)గా పనిచేస్తున్న జి. రాజేంద్ర ప్రసాద్ పదోన్నతిపై సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కొత్త బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.






# స్నేహం చిరకాలం... జ్ఞాపకం శాశ్వత

- స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం






**చర్ల, ఆగస్టు 01(ప్రజాజ్యోతి):** మనిషి జీవితంలో ఎన్నో బంధాలు ఉంటాయి. కొన్ని జన్మతో వస్తాయి మరికొన్ని మనమే ఏర్పరచుకుంటాం అలాంటి బంధాల్లో అత్యంత విలువైనది స్వార్థం లేని పవిత్రమైనది స్నేహబంధం. తల్లిదండ్రుల తర్వాత మన బాధను తన బాధగా మన సంతోషాన్ని తన సంతోషంగా భావించి మన వెంటే నడిచే వ్యక్తి నిజమైన స్నేహితుడు. అందుకే స్నేహం అనేది కేవలం ఒక పరిచయం కాదు హృదయాలను కలిపే అపురూపమైన అనుబంధం.చిన్ననాటి పాఠశాల రోజుల నుంచి మొదలైన స్నేహం కాలగమనంలో ఎన్నో జ్ఞాపకాలను మనకు అందిస్తుంది. కలిసి చదివిన రోజులు, ఆడుకున్న ఆటలు, చిన్న చిన్న అల్లర్లు, పంచుకున్న ఆనందాలు, ఎదుర్కొన్న కష్టాలు జీవితాంతం మరచిపోలేని మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా చిన్ననాటి స్నేహితులను తలచుకుంటే ప్రతి ఒక్కరి హృదయం ఆనందంతో నిండిపోతుంది.జీవితంలో ఎన్నో సందర్భాల్లో తల్లిదండ్రులతో కూడా చెప్పుకోలేని విషయాలను మనం మన స్నేహితులతో నిస్సంకోచంగా పంచుకుంటాం. మనసులోని బాధను చెప్పుకుంటే ఓదార్పునిచ్చేది, తప్పు చేస్తే మందలించి సరైన దారిలో నడిపించేది, విజయం సాధిస్తే మనకంటే ఎక్కువగా సంతోషించేది, అపజయం ఎదురైతే ధైర్యం చెప్పేది నిజమైన మిత్రుడే. అందుకే స్నేహితుడు మన జీవితంలో భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన వరంగా భావిస్తారు.నేటి వేగవంతమైన ప్రపంచంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కోసం ఎంతో మంది దేశ విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. అయినప్పటికీ నిజమైన స్నేహానికి దూరం అనే అడ్డంకి ఉండదు. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఒక ఫోన్ కాల్, ఒక పలకరింపు చాలు ఆ అనుబంధం మళ్లీ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. కాలం మారినా, పరిస్థితులు మారినా, జీవితంలో కొత్త బాధ్యతలు వచ్చినా నిజమైన స్నేహం మాత్రం ఎప్పటికీ మారదు.నిజమైన స్నేహం కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు, ఆర్థిక స్థితిగతులు అనే భేదాలను దాటి హృదయాలను కలుపుతుంది. ఒకరి విజయాన్ని మరొకరు తమ విజయంగా భావిస్తూ, కష్టకాలంలో అండగా నిలుస్తూ, జీవితాంతం ఒకరికొకరు తోడుగా ఉండడమే నిజమైన స్నేహానికి నిదర్శనం. అలాంటి మిత్రులు జీవితంలో ఉండటం ప్రతి ఒక్కరి అదృష్టం.ప్రతి ఏడాది ఆగస్టు నెల మొదటి ఆదివారం ప్రపంచవ్యాప్తంగా స్నేహితుల దినోత్సవం ను ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటారు. చిన్న చిన్న బహుమతులు, శుభాకాంక్షలు, కలిసి గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్నేహబంధాన్ని మరింత మధురంగా మార్చుకుంటారు.ఈ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని స్నేహితులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తూ ప్రతి స్నేహబంధం ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, పరస్పర గౌరవంతో కలకాలం చిరస్థాయిగా కొనసాగాలని ప్రతి జీవితంలో ఒక మంచి మిత్రుడు ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరుకుందాం.సంపదలు తగ్గిపోవచ్చు... పదవులు మారిపోవచ్చు... కాలం గడిచిపోవచ్చు... కానీ హృదయపూర్వకంగా ఏర్పడిన నిజమైన స్నేహం మాత్రం ఎన్నటికీ చెరిగిపోదు. జీవితాంతం మన హృదయంలో చిరునవ్వుగా ,తీపి జ్ఞాపకంగా నిలిచిపోతుంది. జీవితంలో అత్యంత విలువైన సంపద స్నేహం మాత్రమే..

## ఓటరు నమోదు విజయానికి కృషి చేసిన కాంగ్రెస్ బీఎల్ఏలకు నగదు ప్రోత్సాహకం



**టేకులపల్లి,ఆగస్టు0,ప్రజాజ్యోతి:** ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ మాట్లాడుతూ, ఓటరు నమోదు కార్యక్రమంలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించారని అభినందించారు. మిగిలి ఉన్న నమోదు ప్రక్రియను కూడా అదే నిబద్ధతతో పూర్తి చేసి, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు నమోదు అత్యంత కీలకమని, ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దర్యాప్తు పూర్తయ్యే వరకు రేగపై అసత్య ప్రచారం ఆపాలి

- బీఆర్ఎస్ నాయకులు

**ఆళ్ళపల్లి,ఆగస్టు1(ప్రజా జ్యోతి)** మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావుపై సోషల్ మీడియా, కొన్ని మీడియా వేదికల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్నిఆళ్ళపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఫిర్యాదు నమోదు కావడం చట్టపరమైన ప్రక్రియలో భాగమేనని, దర్యాప్తు పూర్తికాకముందే నిర్ధారణ కాని ఆరోపణలను ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టపరమైన ప్రక్రియను గౌరవిస్తూ సంయమనం పాటించాలని, నిజానిజాలను దర్యాప్తు సంస్థలే వెలికితీస్తాయనే విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం సామాజిక సేవ చేయాలి

- డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 01,(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవి విరమణ అనంతరం సమాజ సేవ చేస్తూ అందరికీ సహాయ పడాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కె.టి.పి.ఎస్ 5, 6 దశలలోని 7 వ దశలోని ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేశారు. కె.టి.పి.ఎస 5, 6 దశల్లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గా పని చేస్తున్న పర్వత రామారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న కొల్లు వెంకటేశ్వరరావు, 7వ దశలో 1గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సముద్రాల రాంబాబు, 2 గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సయ్యద్ యాకూబ్, ప్లాంట్ అటెండెంట్ గా పని చేస్తున్న చిటికెన నాగేశ్వరరావు లు పదవి విరమణ పొందారు. వీరి పదవీ విరమణ సందర్భంగా కె.టి.పి.ఎస కర్మాగారాల్లో జరిగిన రిటైర్మెంట్ ఫంక్షన్ లో కొత్వాల తో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలదేవి దంపతులు పాల్గొన్నారు. కొత్వాల మాట్లాడుతూ ఉద్యోగులు సంపాదించిన దానిలో కొంతమేర తోటి వారికి సహాయ పడాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, పలువురు ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## సారపాక రెడ్డిపాలెం, ఇరవెండి మొండికుంటకు రాకపోకలు బంద్

- కొల్లు ప్రాంతంలో వరదలో చిక్కుకున్న లారీలు...
- బోటు సహాయంతో డ్రైవర్లను రక్షించిన ఉపసర్పంచ్, స్థానికులు



**బూర్గంపహాడ్, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి ):**ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. శనివారం భద్రాచలం వద్ద మధ్యాహ్నానికి 55.90 అడుగులకు వరదనీటి మట్టం చేరుకోవడంతో పరివాహక ప్రాంతాలైన సారపాక–నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, రెడ్డిపాలెం–బూర్గంపహాడ్, ఇరవెండి– మొండికుంట, రహదారులపైకి వరద నీరు చేరి ప్రవహిస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో వాహనాల రాకపోకలను అధికారులు, ప్రజాప్రతినిధులు నిలిపివేశారు. మోతే పట్టీనగర్ వద్ద సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు గోదావరి వరదనీరు చేరడంతో గద్దెలు నీటిముంపునకు గురయ్యాయి. గోదావరి వరద ఉధృతికి బూర్గంపహాడ్ కొల్లు ప్రాంతంలోని చాకలిబజార్, ఎస్సీ కాలనీలు, సారపాకలోని బసప్పక్యాంప్, భాస్కరనగర్ ఎస్టీకాలనీ, పాత సారపాక, కండక్టర్స్ కాలనీల్లోకి వరదనీరు చుట్టుముట్టింది. మోతే పట్టీనగర్లో లోతట్టు ప్రాంతాల్లో కొన్ని ఇళ్లు నీట మునిగాయి. దీంతో ముందుగానే అప్రమత్తమైన మండల అధికార యంత్రాంగం శుక్రవారం రాత్రి నుంచి వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు చేసేందుకు మండల కేంద్రంలోని కేజీబీవీ, మార్కెట్యార్డులోని రైతువేదిక, సారపాకలో బీపీఎల్ స్కూల్ వద్ద కళాభారతి, సెయింట్ థెరిస్సా పాఠశాల, తాళ్లగొమ్మూరులోని కల్యాణమండపం, ఇరవెండిలో యూపీఎస్ పాఠశాల, నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని ప్రభుత్వ హైస్కూల్లను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. అధికారుల బృందంలో తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎస్సై మేడా ప్రసాద్, ఎంపీవో రామకృష్ణ, సర్పంచ్ కిషోర్నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్లు వరద బాధితులకు సహాయ సహకారాలు అందించారు. మండల కేంద్రమైన బూర్గంపహాడ్లోని లోతట్టు ప్రాంత వరద బాధితులతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన సారపాక, మోతే పట్టీనగర్ వరద బాధితులను పునరావాస కేంద్రాలకు పంపడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సఫలమయ్యారు.



### ››› వరదలో చిక్కుకున్న లారీలు....

గోదావరి వరద ఉధృతి పెరగడంతో వేలేరు – బూర్గంపహాడ్ మధ్యలో ఉన్నకొల్లు ప్రాంతంలో మూడు లారీలు చిక్కుకున్నాయి. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్లు కేకలు వేయడంతో అక్కడే సహాయక చర్యల్లో ఉన్న బూర్గంపహాడ్ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, స్థానికుడు బబ్బురాయుడు అధికారుల సహాయంతో బోటును ఏర్పాటు చేసి చిక్కుకున్న లారీల ప్రదేశానికి వెళ్లారు. అక్కడ ఎంతో జాగ్రత్తగా వారిని బోటులో ఎక్కించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. లారీ డ్రైవర్లు సురక్షితంగా బయటకు రావడంతో అధికారులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

- జిల్లాలో వరుసగా తెరపైకి వస్తున్న వివాదాలు...
- బీఆర్ఎస్ కు ఇబ్బందికరంగా మారుతున్న పరిస్థితులు
- మూడు సంవత్సరాల క్రితం పాల్వంచ ఘటన రాష్ట్రాన్నే కుదిపేసింది..
- ఇప్పుడు జిల్లా అధ్యక్షుడిపైనే కేసు నమోదు కావడంతో మళ్లీ అదే చర్చ..
- ప్రజల మదిలో ఇంకా చెరగని పాత జ్ఞాపకాలు.. కొత్త వివాదంతో మళ్లీ తెరపైకి..
- పార్టీ ప్రతిష్ఠపై మరోసారి చర్చకు దారితీసిన పరిణామాలు..
- నాయకుల వ్యక్తిగత వ్యవహారాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపుతున్నాయా అనే ప్రశ్నలు..




# నాడు రాఘవ... నేడు రేగా..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయాల్లో మూడు సంవత్సరాల వ్యవధిలో చోటుచేసుకున్న రెండు పరిణామాలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. 2022లో పాల్వంచలో జరిగిన వనమా రాఘవ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఇప్పుడు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై హైదరాబాద్ లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. రెండు వ్యవహారాల స్వరూపం, కేసుల అంశాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, జిల్లా స్థాయి కీలక నాయకుల పేర్లు వరుసగా వివాదాల నేపథ్యంలో వినిపించడం బీఆర్ఎస్ కు రాజకీయంగా అసౌకర్యాన్ని కలిగిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### జిల్లాను కుదిపేసిన వనమా ఘటన...

2022 జనవరిలో పాల్వంచలో జరిగిన ఘటనను జిల్లా ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. కుటుంబ పెద్ద నాగ రామకృష్ణ మరణానికి ముందు విడుదల చేసిన వీడియోలు, రాసిన లేఖ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ప్రతి ఒక్కరినీ కలిచివేశాయి. ఇద్దరు చిన్నారులతో పాటు ఒక కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోవడం కేవలం నేర ఘటనగా కాకుండా సమాజాన్ని ఆలోచింపజేసిన విషాదంగా మిగిలిపోయింది.

ఆ వీడియోల్లో చేసిన ఆరోపణల ఆధారంగా వనమా రాఘవేంద్రరావు పేరు వెలుగులోకి రావడం, అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయడం వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో గ్రామాల నుంచి పట్టణాల వరకు ఇదే అంశం చర్చనీయాంశమైంది. మహిళల భద్రత, ప్రజాప్రతినిధుల బాధ్యత, రాజకీయ నాయకుల ప్రవర్తనపై విస్తృతంగా చర్చ జరిగింది. అప్పటి అధికార పార్టీ టీఆర్ఎస్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ఒక నాయకుడిపై వచ్చిన ఆరోపణల ప్రభావం పార్టీ ప్రతిష్ఠపైనా పడిందనే విశ్లేషణలు అప్పట్లో వినిపించాయి.

### రేగా వ్యవహారంతో మళ్లీ అదే చర్చ...

ఆ ఘటన జరిగి మూడు సంవత్సరాలు పూర్తవుతున్న సమయంలో ఇప్పుడు అదే జిల్లాకు చెందిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేరు మరో కేసు నేపథ్యంలో వార్తల్లోకి రావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎఫ్ ఐఆర్ లో ప్రేమ, పెళ్లి హామీ, ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు తదితర అంశాలు ప్రస్తావనకు రావడంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది. జిల్లా పార్టీ అధ్యక్షుడి హోదాలో ఉన్న నాయకుడి పేరు ఇలాంటి వివాదంలో వినిపించడం సహజంగానే పార్టీ శ్రేణుల్లోనూ చర్చకు దారితీసింది. ముఖ్యంగా మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఘటన జ్ఞాపకాలు ఇంకా ప్రజల మదిలో ఉండగానే మరోసారి జిల్లా నాయకత్వానికి సంబంధించిన వివాదం వెలుగులోకి రావడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

### బీఆర్ఎస్ నిర్ణయం ఎలా ఉండబోతోంది..?

బీఆర్ఎస్ లో క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం కఠినంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యవహారాల్లో ఎంతటి నాయకుడైనా చర్యలకు అతీతుడు కాదనే సంకేతాలను గతంలో పలుమార్లు ఇచ్చింది. అవసరమైతే సొంత కుటుంబ సభ్యుల విషయంలోనూ కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడదనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాల్వంచ ఘటన తర్వాత వనమా రాఘవపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు నమోదు కావడంతో మరోసారి అందరి దృష్టి బీఆర్ఎస్ అధిష్ఠానంపైనే పడింది. గతంలో అనుసరించిన క్రమశిక్షణనే ఇప్పుడు కూడా కొనసాగిస్తుందా..? లేక ఈ వ్యవహారంలో భిన్నమైన నిర్ణయం తీసుకుంటుందా..? అన్నదే రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది. రేగా వ్యవహారంలో పార్టీ తీసుకునే నిర్ణయం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

### ప్రతిపక్షాలకు అవకాశం... పార్టీకి పరీక్ష

రాజకీయాల్లో ఆరోపణలు, కేసులు కొత్తవి కాకపోయినా, జిల్లా స్థాయి కీలక నాయకుల పేర్లు వరుసగా వివాదాల్లో వినిపించడం మాత్రం ప్రజల్లో ప్రశ్నలు రేకెత్తిస్తోంది. నాయకుల వ్యక్తిగత వ్యవహారాలు చివరకు పార్టీ ప్రతిష్ఠపైనా ప్రభావం చూపుతాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. జిల్లా స్థాయిలో పార్టీకి ముఖచిత్రంగా ఉన్న నాయకుడిపై వివాదం తలెత్తితే దాని ప్రభావం పార్టీపై కూడా పడటం సహజమేనని పరిశీలకులు చెబుతున్నారు. వనమా ఘటన తర్వాత అప్పటి టీఆర్ఎస్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంది.

ఇప్పుడు రేగా కాంతారావు వ్యవహారం వెలుగులోకి రావడంతో ప్రత్యర్థి పార్టీలకు మరోసారి విమర్శించే అవకాశం లభించిందనే చర్చ సాగుతోంది. ఇప్పటికే బీజేపీ రేగా కాంతారావు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేసింది.

కాంగ్రెస్, సీపీఐ, జనసేన తదితర పార్టీలు ఈ అంశంపై ఎలాంటి రాజకీయ వైఖరి అవలంబిస్తాయన్నదానిపైనా ఆసక్తి నెలకొంది. అదే సమయంలో ప్రజల్లో ఏర్పడుతున్న చర్చను బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందన్నది కూడా రాజకీయంగా కీలక అంశంగా మారింది.